క్లుప్తంగా

బ్రాందీషాపు గృహాలకు దూరంగా ఏర్పాటు చేయాలి



కర్లపాలెం:నివాస గృహాల మధ్యన ఏర్పాటు చేసిన బ్రాంది షాపును మార్చి గ్రామం వెలుపల ఏర్పాటు చేసుకోవాలని గణపవరం గ్రామస్తులు మంగళవారం తహసీల్దార్ సుందరమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ రోడ్డు పక్కనే నివాస గృహాల మధ్య సాయిబాబా దేవాలయానికి సమీపంలో బ్రాందీ షాపు ఉండటం వలన స్థానిక ప్రజలకు అసౌకర్యంగా ఉందని చెప్పారు. మద్యం తాగుతున్న వారు రోడ్డు పక్కన కూర్చోవటం వలన మహిళలకు, విద్యార్థులకు, గుడికి వచ్చే భక్తులకు సమస్య ఉందని అధికారులు స్పందించి బ్రాందీ షాపును నివాస గృహాలకు దూరంగా మార్చాలని వినతిపత్రంలో కోరారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



కర్లపాలెం: రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించటం వలన దిగుబడులు పెరిగే అవకాశం ఉంటుందని మండల వ్యవసాయాధికారి సుమంత్‌కుమార్ చెప్పారు. కర్లపాలెం మండల పరిధిలో బుద్దాం, యాజలి గ్రామాలలో మంగళవారం వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ ప్రస్తుతం వరిపైరు చిగురు దశలో ఉన్నందున ఎకరానికి 30 కేజీల యూరియా, 20కేజీల పొటాష్ వేయాలని చెప్పారు. పైరు సుంకు రాలే దశలో ఎట్టి పరిస్థితుల్లోనూ మధ్యాహ్నం వేళ ఎటువంటి పురుగు మందులు పిచికారీ చేయకూడదని చెప్పారు. సుంకు రాలితే తాలు గింజలు వచ్చే ప్రమాదం ఉందని రైతులు గమనించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బుద్దాం సర్పంచ్ నర్రా మంగమ్మ, ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ శ్రీకాంత్, ఏఈవో భాగ్యలక్ష్మి, గ్రామ వ్యవసాయ సహాయకులు గోపి, బాజీ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

260 మందికి ఉచిత వైద్య పరీక్షలు



కర్లపాలెం: ప్రతి ఒక్కరూ పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ వైద్యుడు రామాంజనేయులు చెప్పారు. కర్లపాలెం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గ్రామీణ సత్యసాయి మందిరంలో మంగళవారం కిమ్స్ హాస్పిటల్ వైద్యులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి 260 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. రామాంజనేయులు మాట్లాడుతూ ఏ వ్యాధికైనా సకాలంలో వైద్యం చేయగలిగితే త్వరగా నయమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆప్తమాలజిస్ట్ రాణి, పీఆర్వో రఫీ, బ్రహ్మ కిషోర్, గోవర్ధన్, శ్రీనివాసరావు, సత్యనారాయణ, మొహిద్దీన్ బేగ్, డి. శ్రీనివాసరెడ్డి, బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీసాయిక్షేత్రం వార్షికోత్సవం



తెనాలి: రూరల్ మండల గ్రామం నందివెలుగులోని షిర్డి సాయిబాబా మందిరం 'శ్రీసాయి క్షేత్రం'లో మంగళవారం 12వ వార్షిక మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఉదయం కాకడ హారతితో మొదలై, సాయిబాబా, దత్తాత్రేయ స్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ సుగంధ ద్రవ్యాది సహిత పంచామృత అభిషేకం నిర్వహించారు. తెనాలికి చెందిన శారదా చలపతి బృందంచే శ్రీసాయినామ సంకీర్తన భక్తులకు శ్రవణానందం కలిగించింది. విశిష్ట అతిథులచే శ్రీషిర్డీ సాయినాథుని లీలా ప్రవచనామృతం' తదుపరి మధ్యాహ్న హారతిని వెంపటి చిన సత్యనారాయణ చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం సంధ్య హారతి తదుపరి సాయినాథుని ఊరేగింపు ఉత్సవం నందివెలుగు పురవీధుల్లో సన్నాయి మేళాలు, కీర్తనలు, కోలాటం, నృత్యాలతో కొనసాగింది. గ్రామస్తులు పెద్ద ఎత్తున ఊరేగింపును సందర్శించి, స్వామిని దర్శించుకున్నారు. ఇటీవల దసరా శరన్నవ రాత్రుల్లో భాగంగా బాలబాలికలకు నిర్వహించిన బాబా సచ్చరిత్ర, శ్రీసాయిబాబాపై క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. శ్రీసాయిబాబా పవళింపు సేవ అనంతరం శేజ్ హారతితో కార్యక్రమాలను ముగించారు. శ్రీసాయి క్షేత్రం చైర్మన్ ఆదిపూడి సాయిరాం, ఎ.సాంబశివరావు, వెంపటి చిన్న సత్యనారాయణ పాల్గొన్నారు.



అధ్వానంగా ఉన్న రేపల్లె-నిజాంపట్నం ప్రధాన రహదారి



గుంతలమయమైన నిజాంపట్నం రోడ్డు



చుండూరు మండలం చిన పరిమి వెళ్లే రోడ్డు దుస్థితి



భట్టిప్రోలు మండలం వెల్లటూరు నుం చింత మోటు వెళ్లే రహదారిలో గుంతలు

ప్రయాణం ఛిద్రహింస

- అధ్వానంగా రోడ్లు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- వాహనదారులకు తప్పని వెతలు

రేపల్లె రూరల్/వేమూరు: పాలకుల అలసత్వం... అధికారుల నిర్లక్ష్యం వెరసి ప్రజల పాలిట శాపాలుగా మారుతున్నాయి. వేమూరు, రేపల్లె నియోజకవర్గాల్లోని ప్రధాన రహదారులు అధ్వానంగా మారాయి. గుంతలమయమై ప్రజలకు నరకం చూపిస్తున్నాయి. రోడ్లు ఛిద్రం కావడంతో ప్రయాణం చిత్రహింసను తలపిస్తోంది. ఫలితంగా వాహనచోదకులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేపల్లె-నిజాంపట్నం ప్రధాన రహదారి తీవ్రంగా దెబ్బతింది. దారి పొడుగునా పెద్దపెద్ద గుంతలు పడ్డాయి. ఈ గుంతల్లో పడి వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ దారిపై నిజాంపట్నం, కూచినపూడి, పల్లపట్ల, శింకపాలెం, యేమినేనివారిపాలెం, ఆముదాలపల్లి తదితర గ్రామాల నుంచి నిత్యం వందల సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతోపాటుగా నిజాంపట్నం హార్బర్ నుంచి మత్స్యసంపదను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఈ రహదారే ప్రధాన రవాణా మార్గం. అయినా ఈ రోడ్డుకు కనీస మరమ్మతులు చేపట్టడం లేదు. ఎన్నికల ముందు ఊకదంపుడు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన నేతలు రహదారి అభివృద్ధిపై ఇప్పటి వరకు నోరు మెదపకపోవటంతో ఆయా గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు నిర్వహించాలని కోరుతున్నారు. వేమూరు నియోజకవర్గంలోనూ పలు రోడ్లు గుంతలమయమై ప్రజలకు నరకం చూపిస్తున్నాయి. ఎన్నికల ముందు రోడ్లు బాగు చేస్తామని వాగ్దానం చేసిన నేతలు ఇప్పుడు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



వేమూరు నుంచి చావలి వెళ్లే రోడ్డు పరిస్థితి

పోలీసు అమరవీరులకు నివాళి

నగరం/వేమూరు/రేపల్లె రూరల్: విధి నిర్వహణలో అసువులుబాసిన పోలీసు అమరవీరులకు ప్రతి ఒక్కరూ రుణపడి ఉంటారని రూరల్ సీఐ సురేష్‌బాబు అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా విధి నిర్వహణలో అమరులైన కట్టుపల్లి వెంకటేశ్వరరావు, కాసాని శివాంజనేయులు కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించి మాట్లాడారు. అమరులైన పోలీసులకు తమ శాఖ ఎప్పుడూ అండగా నిలుస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు, శివాంజనేయులు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ భార్గవ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

- వేమూరు మండలంలోని పెరవలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మంగళ వారం అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. రూరల్ సీఐ ఆంజనేయులు మాట్లాడుతూ అమరుల త్యాగాలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రవికృష్ణ, ప్రధానోపాధ్యాయులు స్వరోజిని పాల్గొన్నారు.
- రేపల్లె పట్టణంలోని మోంట్‌ఫోర్ట్ స్కూలులో పోలీసు పట్టణ సర్కిల్ కార్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. పట్టణ సీఐ మల్లికార్జునరావు మాట్లాడుతూ సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బ్రదర్ కిరణ్‌కుమార్, వైస్‌ప్రిన్సిపాల్ ప్రదీప్ రెడ్డి, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



నగరంలో పోలీసు అమరవీరుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



పెరవలి జెడ్పీహెచ్ పాఠశాలలో అమర వీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించిన పోలీసులు

పారిశుద్ధ్య పరిరక్షణలో భాగస్తులు కావాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ మంగ

రేపల్లె రూరల్: పట్టణంలో పారిశుద్ధ్య పనుల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో కొబ్బరిబొండాల వ్యాపారులతో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. వ్యాపారులు కొబ్బరి బొండాలను రహదారులపై పడవేయరాదన్నారు. కొబ్బరిబొండాల వ్యాపారులు డొప్పలను పట్టణ ముఖద్వారాల వద్ద పడవేస్తున్నారని, దీంతో అవి కుళ్ళిపోయి ఆయా ప్రాంతాలలో దుర్గంధం వెదజల్లుతోందని పేర్కొన్నారు. వర్షం పడిన సమయంలో ఆ నీరు బొండాల డొప్పలలో చేరటంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని చెప్పారు. బొండాలను గోనెసంచులలో ఉంచి పారిశుద్ధ్య సిబ్బందికి మాత్రమే అందించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు, శానిటరీ ఇనిస్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ

నేడు ఎలుకల నివారణ మందు పంపిణీ

కర్లపాలెం/వేమూరు/చెరుకుపల్లి: సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం కర్లపాలెం మండలంలోని 20 గ్రామ పంచాయతీలలో బ్రోమోడయోలిన్ మందును ఉచితంగా రైతులకు అందజేస్తామని వ్యవసాయ విస్తరణాధికారి భాగ్యలక్ష్మి మంగళవారం తెలిపారు. పిట్టలవానిపాలెం మండలంలోని 14 గ్రామ పంచాయతీలలో ఎలుకల నివారణకు 23న ఉదయం రైతులకు మందు పంపిణీ చేస్తామని వ్యవసాయా విస్తరణాధికారి సుదర్శన్‌రావు తెలిపారు. రైతులు నూకలు, శనగ నూనె తెచ్చుకోవాలని బ్రోమోడయోలిన్ మందులో నూకలు, నూనె కలిపి రైతులకు అందజేస్తామని, వాటిని రైతులు పేపర్‌లో చిన్న చిన్న పొట్లాలు కట్టి ఎలుకల బొరియలలో వేయాలని వ్యవసాయ విస్తరణాధికారులు తెలిపారు.

- వేమూరు మండలంలోని అన్ని రైతు సేవ కేంద్రాల్లో బుధవారం సామూహిక ఎలుకల మందు పంపిణీ చేస్తామని మండల వ్యవసాయాధికారి సునీత తెలిపారు. రైతులందరూ నూకలు, నూనె తీసుకొని వస్తే ఎలుక మందు కలిపి పొట్లాలు కట్టి ఇస్తామని వెల్లడించారు. ఆ పొట్లాలు ఎలుకల బొరియల్లో పెడితే నివారణ సాధ్యమవుతుందని వివరించారు.
- చెరుకుపల్లి మండలంలోని రైతు సేవా కేంద్రాల్లోనూ బుధవారం ఎలుకల నివారణ మందు పంపిణీ చేస్తామని మండల వ్యవసాయ అధికారి బాలాజీ గంగాధర్ తెలిపారు.

సూరత్‌కు అంబేడ్కర్ కాంస్య విగ్రహాలు



తెనాలి: పట్టణ శిల్పకళకు జాతీయస్థాయి గుర్తింపును తీసుకొచ్చిన స్థానిక సూర్య శిల్పశాల, కాటూరి ఆర్ట్ గ్యాలరీ నిర్వాహకులు కాటూరి వెంకటేశ్వరరావు, ఆయన కుమారుడు రవిచంద్ర తాజాగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఫైబర్ గ్లాస్, కాంస్య విగ్రహాలను రూపొందించారు. గుజరాత్ రాష్ట్రంలోని సూరత్ పట్టణంలో ప్రతిష్ట నిమిత్తం తయారుచేసిన ఈ విగ్రహాలను మంగళవారం ప్రత్యేక వాహనంలో అక్కడకు తరలించారు. గతంలో కుర్చీలో కూర్చున్నట్టు రూపొందించిన అంబేడ్కర్ విగ్రహాన్ని గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు పంపగా, వచ్చిన ఆదరణతో ఇప్పుడు సూరత్ నుంచి ఆర్డరు వచ్చినట్టు కాటూరి తెలియజేశారు. ఏడున్నర అడుగుల ఫైబర్‌గ్లాస్ విగ్రహంతోపాటు నాలుగున్నర అడుగుల ఎత్తులో రెండు కాంస్య విగ్రహాలకు 1300 కిలోల కాంస్యాన్ని వినియోగించి, తయారీకి మూడు నెలల సమయం పట్టినట్టు వివరించారు.

రైల్లో నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

తెనాలిరూరల్: రైలు నుండి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తెనాలి పెదవడ్లపూడి స్టేషన్ల మధ్య మోరంపూడి రైల్వే గేటు సమీపంలో పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని మంగళవారం పరిశీలించారు. సుమారు 30 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. రైల్లో నుండి జారిపడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి జేబులో గౌహతి నుండి కోయంబత్తూర్‌కు తీసుకున్న టికెట్ ఉంది. మృతదేహాన్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెంకటాద్రి తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440627554 నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

సస్య రక్షణ అవసరం



గోవాడ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించిన వ్యవసాయాధికారులు



జంపని గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించిన వ్యవసాయాధికారులు

వేమూరు/రేపల్లె రూరల్: వరి పైరులో దోమ, ఆకుముడత పురుగు నివారణకు రైతులు తప్పని సరిగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారిణి ఉయ్యూరి లోకేశ్వరి తెలిపారు. అమర్తలూరు మండలంలోని గోవాడ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళ వారం నిర్వహించారు. లోకేశ్వరి మాట్లాడుతూ తెగుళ్ల నివారణ గురించి వివరించారు. బుధవారం ఉదయం రైతు సేవాకేంద్రాలు, పంచాయతీ కేంద్రాల వద్ద ఎలుకల నివారణ మందు పంపిణీ చేస్తామని వివరించారు.

- వరి పంటలో ఆకు ముడత పురుగు, కాండం తొలచు పురుగు నివారణకు రైతులు పురుగు మందులు పిచికారీ చేయాలని బాపట్ల జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సయ్యద్ హుస్సేన్ చెప్పారు. వేమూరు మండలంలోని జంపని గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళ వారం నిర్వహించారు. హుస్సేన్ మాట్లాడుతూ ఆకు ముడత పురుగు, కాండం తొలచు పురుగు నివారించేందుకు రైతులు వేప గింజలు కషాయం పిచికారీ చేయాలని చెప్పారు. ఉధృతంగా ఉంటే చేపట్టాల్సిన చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సునీత పాల్గొన్నారు.

రేపల్లె మండలంలో..



రేపల్లె మండలంలో వరిపొలాన్ని పరిశీలిస్తున్న ఏవో విజయ్‌బాబు

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రేపల్లె మండలంలోని గంగడిపాలెం, రాజుకాల్వ గ్రామాలలో మంగళవారం వ్యవసాయ అధికారులు పర్యటించి వరిపొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి విజయ్‌బాబు రైతులకు సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

రహదారి పక్క చెత్త తొలగింపు



చెత్త వేయరాదంటూ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

సాక్షి ఎఫెక్ట్

రేపల్లె రూరల్: పట్టణం నుంచి మోంట్‌ఫోర్ట్ స్కూలు మీదుగా పేటేరు వెళ్ళే రహదారిలో ఉన్న డంపింగ్ యార్డులో పడవేస్తున్న చెత్త రహదారిపైకి చేరటంతో రాకపోకలు సాగించే ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులపై గత నెల 28న సాక్షి దినపత్రికలో డంపు.. కంపు శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రహదారికి ఇరువైపులా పేరుకుపోయిన చెత్త నిల్వలను తొలగించి ఈ ప్రదేశంలో చెత్తవేయరాదంటూ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. సమస్య పరిష్కారం కావటంతో స్థానికులు, వాహన చోదకులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



చెత్త తొలగించటంతో పరిశుభ్రంగా కనిపిస్తున్న రహదారి



నాడు చెత్త నిల్వలతో నిండిపోయిన రహదారి (ఫైల్)

విష మొక్కలు తిని 12 గొర్రెలు మృతి

తూములూరు(కొల్లిపర): విషం మొక్కలు తిని 12 గొర్రెలు మృతి చెందిన సంఘటన మంగళవారం తూములూరు గ్రామంలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని తూములూరు గ్రామ శివారు లంబాడిపాలెంకు చెందిన బాణవత్ బుషి నాయక్ తూములూరు గ్రామంలోని ప్రధాన కూడలిలో ఒక ఖాళీ స్థలంలోకి గొర్రెలన్నింటినీ పచ్చి మేత కోసం పంపించాడు. పంపిచిన 10 నిముషాల్లో సుమారు 12 గొర్రెలు మృత్యువాతకు గురయ్యాయి. ఏమి జరిగిందే తెలియక వెంటనే మండల పశువైద్యులకు సమాచారం ఇవ్వగా కంపౌండర్ వెంటనే సంఘటన స్థలానికి వచ్చి బతికి ఉన్న గొర్రెలకు ప్రథమ చికిత్స చేశారు. మృతి చెందిన వాటిని కొల్లిపర లోని పశు వైద్య శాలకు తరలించారు. మండల పశు వైద్యాధికారి డాక్టర్ సాయి సతీష్‌రాజు, తూములూరు జూనియర్ వెటర్నర్ ఆఫీసర్ డాక్టర్ సుభాని మృతి చెందిన మేక పోతులకు పోస్ట్ మార్టర్ చేయగా అవి విషం ఉన్న మొక్కలు తినటం వలన మృత్యు వాతపడ్డాయని గుర్తించారు. ఇదే స్థలంలో 15 రోజుల క్రిందట వేరొక మేకల కాపరికి చెందిన మూడు మేకలు మృతి చెందడం గమనార్హం. రెండేళ్ల కిందట కూడా ఇలాగే నాలుగు గొర్రెలు మృతి చెందిన సంఘటన గుర్తు చేసుకున్నారు. మృతి చెందిన 12 గొర్రెలు విలువ సుమారు రూ.3 లక్షలుగా అంచనా వేశారు.



విష మొక్కలను తిని మృతి చెందిన గొర్రెలు

కాసులు కురిపిస్తున్న ఉచిత ఇసుక



పొక్లయినర్‌తో ట్రాక్టరులో ఇసుక లోడింగ్ చేస్తున్న దృశ్యం

కొల్లిపర: ఉచిత ఇసుక విధానం దళారులకు కాసులు కురిపిస్తోంది. గ్రామాల్లో నిల్వ చేసుకున్న ఇసుకను అమ్మేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎడ్లబండ్లు, ట్రాక్టర్లలో ఉచిత ఇసుకను తీసుకెళ్లొచ్చని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను ఇందుకు అవకాశంగా తీసుకున్నారు. అయితే అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. నదికి, వాగులు, వంకల్లో ఆనుకొని ఉన్న గ్రామాల్లో అక్కడి ప్రజల అవసరాల నిమిత్తం 10 కిలో మీటర్ల లోపు వారికి అందుబాటులో ఉన్న ఎండ్ల బండి, ట్రాక్టర్ల ద్వారా ఇసుకు తీసుకొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఇదే విషయాన్ని ప్రకటించారు. ఎండ్ల బండి, ట్రాక్టర్‌తో ఇసుక తరలింపు విషయంలో మంత్రులు, కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, పోలీసులు పటించు కోవద్దని చెప్పారు. ఉచిత ఇసుక విధానంలో ఇంతకు మించి ఎటువంటి విధి విధానాలను స్పష్టంగా తెలియజేయలేదని చెబుతున్నారు. ఇసుక అక్రమాలు జరుగుతున్నా రెవెన్యూ, పోలీసులు చేసేదేమిలేక ఊరుకుంటున్నారు. కొల్లిపర మండలంలో గత మూడు రోజుల నుంచి ఇసుక తరలింపు కొనసాగుతోంది. ఎగువ ప్రాంతాల్లో వర్షాల కారణంగా కృష్ణానదికి నీటి ప్రవాహం పెరిగింది. ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు నీరు విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో రెండు లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. నదిలో ఇసుక తీయడానికి అవకాశం లేకుండాపోయింది. దీంతో కూటమి నాయకులు, ఇసుక దళారులు గ్రామాల్లో ఉన్న ఇసుక నిల్వలపై దృష్టి సారించారు. గ్రామంలో ఎక్కడైనా ఇసుక నిల్వలు కనిపిస్తే చాలు... వారి వద్దకు వెళ్లి బేరాలు సాగిస్తున్నారు. ట్రాక్టర్ ఇసుక రూ.2 వేల నుంచి రూ.2.500 వరకు కొనుగోలు చేస్తున్నారు. కృష్ణా నదిలో వరద ప్రవాహం తగ్గిన వెంటనే ఉచిత ఇసుక విధానంలో మళ్లీ ఇసుక తోలుతాం అని హామీనిస్తున్నారు. ఆ విధంగా వారి నుంచి ఇసుకను తక్కువ ధరకు కొనుగోలు చేసి, తెనాలి, గుంటూరు వంటి పట్టణాలు, నగరాలకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. తెనాలిలో ట్రాక్టర్ రూ.4-5 వేల వరకు, గుంటూరు జిల్లా కేంద్రంలో ట్రాక్టర్ రూ.7-8 వేల వరకు అమ్ముతున్నారు. గ్రామస్తుల వ్యక్తిగత, సామూహిక అవసరాల కోసం ఉచిత ఇసుక విధానంగా ప్రభుత్వం ప్రకటిస్తే, అందుకు భిన్నంగా ఇసుకను వ్యాపార సరుకుగా మార్చేశారు. గ్రామాల నుంచి పట్టణాలు, నగరాలకు అమ్ముతున్నారు. చివరకు రోడ్డు కాంట్రాక్టరు నిల్వ ఉంచిన ఇసుకను కూడా దళారులు కొనుగోలు చేసి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. ఉచిత ఇసుక విధానంలో తగిన విధి విధానాల్లో స్పష్టత లేకపోవటంతో అధికారుల పర్యవేక్షణ కొరవడింది. వాటిపై ప్రభుత్వ శాఖలకు తగిన గైడ్‌లైన్స్ ఇవ్వాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. లేకుంటే దళారులకు అడ్డుకోవటం అధికారులకు సాధ్యంకాదు. పైగా ముందు నదినుంచి ఇసుక తీసే విషయంలోనూ విభేదాలు, గొడవలు జరిగే ఆస్కారం ఉందంటున్నారు.

గ్రామాల్లో ఆధార్ క్యాంపులు

భట్టిప్రోలు: కోనేటిపురం, పెదపులివర్రుల్లో బుధవారం ఆధార్ సర్వీస్ క్యాంప్‌లు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎస్‌వీ రమణ తెలిపారు. గురువారం సూరేపల్లి, గొరిగపూడిలలో, శుక్రవారం ఐలవరం, ఓలేరుల్లో క్యాంపులు జరుగుతాయన్నారు.